తాగునీటి కష్టాలు షురూ..

ఇబ్బందుల్లో ప్రజలు

హిమాయత్ నగర్, మార్చి6: గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేసవిలో నగర వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు అందించేలా తగిన చర్యలు తీసుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎండకాలం ఆరంభంలోనే తాగునీటి కష్టాలు మొదలైయ్యాయి. హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారాయణగూడ జలమండలి డివిజన్–5 పరిధిలో సుమారు 75 వేల కనెక్షన్లు ఉండగా.. వీటికి రోజు విడిచి రోజు నీటిని వదులుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా గురువారం కింగ్‌కోఠి, విఠల్‌వాడి, హైదర్‌గూడ, హిమాయత్ నగర్, పైప్ లైన్లు, తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో గుక్కెడు నీళ్ల కోసం ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో లీకేజీలతో నేలపాలవుతున్న మంచినీరు, మరికొన్ని చోట్లలో ప్రెషర్, కలుషితనీరు రావడంతో బస్తీలు, కాలనీల్లో నివాసం ఉండే ప్రజలకు అరకొర మంచినీరు సరఫరా కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో మంచినీటి సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు వస్తే సరఫరా కావాల్సిన ప్రాంతాలకు జలమండలి అధికారులు వాటర్ ట్యాంకులను పంపించేవారు. ఇప్పుడు ఆ విధానంను పూర్తిగా రద్దు చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గొంతు తడుపు కోవడానికి సకాలంలో తాగునీరు సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని ఊదరగొట్టుకోవడం దౌర్భాగ్యమని స్థానికులు మండి పడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నారాయణగూడ జలమండలి కార్యాలయం

ఇబ్బందులు రాకుండా చర్యలు

మంచినీరు సరఫరా అయ్యే పైపులైన్లలో ఇబ్బందులు తలెత్తాయి. మరమ్మత్తులు చేసి మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి వృథాను అరికట్టడానికి లీకేజీ అవుతున్న పైప్‌లైన్లు, వాల్వ్‌లకు మరమ్మత్తులు చేయిస్తున్నాం. మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ప్రజలు తమకు ఫిర్యాదు చేస్తే జల మండలి అధికారులు అందుబాటులో ఉండి సకాలంలో సరఫరా అయ్యేందుకు చొరవ తీసుకుంటాం. – రామకృష్ణ,
నారాయణగూడ జలమండలి జీఎం

కనులపండువగా స్వామివారికి చక్రస్నానం

జూబ్లీహిల్స్ టీడీడీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చక్రస్నానం నిర్వహించారు. స్వామివారి శంఖ చక్రాలకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం సంప్రదాయబద్ధంగా పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. అంతకుముందు పల్లకీ ఉత్సవం, ఉత్సవ మూర్తులకు చూర్ణాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ద్వజ అవరోహనం కార్యక్రమంతో ఉత్సవాలు ముగింపుదశకు చేరుకున్నాయి. శుక్రవారం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. – బంజారాహిల్స్, మార్చి 6

గంజాయి, డ్రగ్స్ పట్టివేత

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): హెరాయిన్ డ్రగ్, గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే... బిహార్‌కు చెందిన చంద్రనరేశ్ సాహిని, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుబోల్ బిశ్వాస్ చందానగర్, శేరిలింగంపల్లి ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఆ ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2.5 లక్షల విలువ చేసే 3.1 కేజీల గంజాయి, 7.5 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయి, డ్రగ్స్ పట్టుకున్న వారిలో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తదితరులున్నారు.

నగదు తీసుకుని.. ఆన్‌లైన్‌లో పంపిస్తానంటూ పరార్

బంజారాహిల్స్,మార్చి 6: నగదు ఇస్తే .. ఆన్‌లైన్ ద్వారా పంపిస్తానంటూ డెలివరీ బాయ్ ను నమ్మించి డబ్బులతో ఉడాయించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బిహార్‌కు చెందిన చందన్ కుమార్ గుప్తా (25) బంజారాహిల్స్ రోడ్ నం. 13లోని శ్రీరాంనగర్‌లో ఉంటూ జెప్టో డెలివరీ బాయ్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్ మీదుగా ఆర్డర్ డెలివరీ కోసం వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆపాడు. తనకు అర్జెంట్‌గా రూ.5వేలు క్యాష్ కావాలని, డబ్బులు ఇస్తే ఆన్‌లైన్‌లో పంపిస్తానని నమ్మించాడు. దీంతో అతను.. తన పర్సులోని డబ్బులు లెక్కిస్తుండగా మొత్తం ఇవ్వాలని కోరాడు. దీంతో తనవద్దనున్న రూ.12వేలు అతడికి ఇచ్చాడు. ఫోన్‌లో సిగ్నల్ లేదని, కొంతదూరం వెళ్లాక డబ్బులు పంపిస్తానని, తనతోపాటు బైక్ ఎక్కాలని చెప్పాడు. కొంతదూరం వెళ్లాక నిర్మానుష్య ప్రాంతంలో బైక్ ఆపి.. చందన్ కుమార్‌ను కిందకు దింపి వేగంగా పారిపోయాడు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలి..

సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

హిమాయత్ నగర్ , మార్చి 6 : రాష్ట్రంలోని దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యేసు రత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. పెరిగిన దళితుల జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించాలని అనే అంశంపై గురువారం హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ ఈ వర్గాల్లో వెనుకబాటుతనం, పేదరికంలో ఏమాత్రం మార్పురాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు విద్య, సామాజిక వికాసం తోపాటు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయడంతో దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో దోహద పడుతుందన్నారు. దళితుల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సహదేవ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటస్వామి, నేతలు కుమారస్వామి, ఆరుట్ల రాజు కుమార్, రాములు, చెట్టుకింది శ్రీనివాస్, కొమ్ము బాబు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించాలి

బంజారాహిల్స్,మార్చి 6: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర యువజన వ్యవహారాలు – క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియాలో మహిళల క్రీడా వారోత్సవాల్లో భాగంగా డా. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో గురువారం వాకో ఇండియా, కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ సంయుక్తంగా కిక్ బాక్సింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్పాచక్రపాణి మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు సమాజంలో హక్కులు, సమానత్వం, సాధికారత చాలా అవసరమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో సమాన భాగస్వామ్యం కలిగి ఉండాలని, వారి హక్కులను గౌరవించాలని, శారీరకంగా, మానసికంగా, వేధింపులకు గురిచేయరాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థలో మహిళలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ క్రీడాకారుడు, యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ప్రవీణ్ కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎల్వీకే.రెడ్డి, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్, కోచ్ సురేశ్ పాటిల్, యూజీసీ – డెబ్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొ. పల్లవీ కాబ్డే, విశ్వవిద్యాలయ మహిళా విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొ. మేరీ సునంద, డా. కె.శ్రీదేవి, డా.రజనీ, డా. ప్రమీలా కేతావత్, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులతో అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి. రిజిస్ట్రార్ ఎల్వీకే.రెడ్డి

యూసుఫ్‌గూడలో మహిళా దినోత్సవం

జూబ్లీహిల్స్, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా గురువారం యూసుఫ్ గూడ కార్పొరేటర్ కార్యాలయంలో సమైక్య డ్వాక్రా గ్రూప్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్.. జీహెచ్ఎంసీ యూసీడీ, డీపీఓ వెంకటకిషన్ రావు, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రశాంత్ అధ్వర్యంలో డ్వాక్రా గ్రూప్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా గ్రూప్ సభ్యురాళ్లు అమ్మాజి, నిర్మల, నాగమణి, శ్రీదేవి, ధనరేఖ, రేష్మ, దేవి, సరోజ, అనురాధ, జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి..

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

బిల్ కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ, మార్చి 6 : నార్సింగి మున్సిపాలిటీలో ఆస్తి పన్నును వందశాతం లక్ష్యంగా వసూలు చేయాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి బిల్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో బిల్ కలెక్టర్లకు ఆయన దిశా నిర్దేశం చేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో బిల్‌కలెక్టర్లు ఎప్పటికప్పుడు బకాయిదారులను కలుస్తూ వసూళ్లు చేపట్టాలని సూచించారు. ఆయా వార్డుల బిల్ కలెక్టర్లు చేసిన కలెక్షన్లపై ఆరాదీశారు. కొన్ని వార్డుల్లో మాజీ కౌన్సిల ర్లు, వైస్ చైర్మన్‌లకు సంబంధించిన బకాయి లే లక్షల్లో పెండింగ్‌లో ఉన్నట్లు బిల్ కలెక్టర్లు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా కొన్ని వ్యాపార సంస్థలు సైతం పన్నులను చెల్లించేందుకు మొండికేస్తున్నారని వారి ని కలిసేందుకే రోజులు గడుస్తున్నాయం టూ బిల్‌కలెక్టర్లు వాపోయారు. సామాన్య,మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా ఆదాయపన్నులను సకాలంలో చెల్లించడంతోపాటు చాలా మంది ఎర్లీబర్డ్‌లోనే చెల్లింపులు చేపట్టారని తెలిపారు. లక్షలాది రూపాయల బకాయిలన్నీ మాజీ ప్రజాప్రతినిధులు, వ్యాపార సంస్థలకు చెందిన వా రివే ఉన్నట్లు కమిషనర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ .. పన్నుల వసూళ్ల విషయంలో ఎవ్వరినీ ఉపేక్షించేది లేదన్నారు.

మొండి బకాయిలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వారితో మాట్లాడి చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. మార్చి 31లోపు వందశాతం వసూళ్లను చేపట్టి రికార్డుస్థాయిలో మున్సిపాలిటీ పేరును నిలపాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేంద్ర, టీపీఓ మణిహారిక, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మహవీర్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 6: రక్తదానం ప్రాణదానంతో సమానం అని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఎల్.జి.గ్రాండ్ యునైటెడ్ వే ఆఫ్ ముంబయి వారి సౌజన్యంతో డాక్టర్ రాజేశ్‌నిర్మాన్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రక్తదానం చేసేందుకు ముందుండాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తం ఉత్పత్తై మరింత ఉత్సాహంగా ఉంటారన్నారు. ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీరేంద్ర పాటిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

ట్రాఫిక్ నిబంధనలను ఆటోవాలాలు తప్పకుండా పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆరాంఘర్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, నంబర్ ప్లేట్లు సరిగ్గా ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు ఆయన ఆటో డ్రైవర్ల నుంచి లైసెన్సులు, ఆటోకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. – బండ్లగూడ, మార్చి 6

వెంగళ రావు నగర్ చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం

వెంగళరావునగర్, మార్చి 6: బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా రవిశేఖర్ రెడ్డి తన స్వంత ఖర్చులతో వెంగళరావు కాలనీ వాసులు, కాలనీ యూత్ అసోసియేషన్ వారితో కలసి వెంగళరావు నగర్ చౌరస్తా వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నాగేశ్వర్‌రావు, సంఘ సేవకుడు మా చర్ల పీటర్ పాల్, బాలాజీ అశోక్, కుటుంబరావు, సారంగరావు, పాపారావు, వెంగళరావునగర్ కాలనీ యూత్ అసోసియేషన్ సభ్యులు నాగరాజు, నాళం రాజు, మారగాని రవి కిరణ్, భరత్, మోజెస్ పాల్గొన్నారు.

విద్యుత్ ఫీడర్ల ఏర్పాటు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 6: వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ డి.శ్రీరామ్‌మోహన్ అన్నారు. గగన్‌పహాడ్, లక్ష్మీగూడ , తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఫీడర్ల లోడ్‌ను విభజించి నూతనంగా ఫీడర్ల ఏర్పాటును డీఈ రత్నాకర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే సంకల్పంతో నిధుల కొరత లేకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రతి సెక్షన్‌లో విద్యుత్ ఫీడర్లను నూతనంగా ఏర్పాటు చేసి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ(కన్‌స్ట్రక్షన్) చంద్రశేఖర్, డీఈ(లైన్స్) చంద్రశేఖర్, డీఈ(ప్రొటెక్షన్) భాస్కర్, గగన్‌పహాడ్ సబ్ డివిజన్ ఏఈడీ ఈశ్వర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్లు రవీందర్, ప్రవీణ్, శ్రీనివాస్, తదితరులున్నారు.

వికలాంగుల క్యాంపుకు స్పందన

శంషాబాద్ రూరల్, మార్చి 6 : వికలాంగుల క్యాంపుకు లబ్ధిదారుల నుంచి విశేష స్పందన వచ్చినట్లు జిల్లా వికలాంగుల అధికారి ప్రభాకర్ తెలిపారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని మహిళా మండలి భవనంలో శిశు సంక్షేమ శాఖ–ఆలిమ్ కో సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి వికలాంగులు భారీగా తరలి వచ్చారని వివరించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఏడాదికి కుటుంబ ఆదాయం రూ.2,70,000లు ఉండాలని, 40శాతం వైకల్యం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డులు తీసుకొని వచ్చారని చెప్పారు. శిబిరానికి తరలివచ్చిన వారిలో 115 మంది వికలాంగులను పరికరాల కోసం ఎంపిక చేసినట్లు వివరించారు. శిబిరంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు భిక్షమమ్మ, జ్ఞానేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు అండాలు, జయ, సంధ్య, జ్యోతి, పల్లవి, ప్రభావతి, అనిత, నీరజ, మంజుల, శ్రీలత, ఆలిమ్ కో సంస్థ ప్రతినిధులు సునీత, శివం, హర్ష ,తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వండి

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర

హిమాయత్ నగర్, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యతను ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఇవ్వడంలేదని విమర్శించారు. యూత్ డిక్లరేషన్‌లో జాబ్ క్యాలెండర్‌తోపాటు నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇస్తామని ప్రకటించి అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రాయితీలతో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఉద్యోగాలు పొందలేని యువతకు ఆర్థిక సహకారం చేసేందుకు యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు శాఖల్లో 1,91,126 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పీఆర్సీ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని తెలిపారు. యువతకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, నగర అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, నగర కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, నేతలు షేక్ మహమూద్, మజీద్ అలీఖాన్, కల్యాణ్, హేమంత్, భగత్ సింగ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నేత ధర్మేంద్ర

ప్రియురాలు పెళ్లికి నిరాకరించడంతో

ప్రియుడి ఆత్మహత్యాయత్నం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 6: ప్రేమించిన ప్రియురాలు తనను పెళ్లి చేసుకోనని చెప్పడంతో ప్రియుడు ఆమె ఇంటి ముందే ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటన గురువారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బాగ్‌లింగంపల్లి కి చెందిన డిగ్రీ విద్యార్థి సోను(21) , లక్ష్మీగూడకు చెందిన ఓ ఎల్ఎల్‌బీ విద్యార్థిని 3 సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. కాగా కొద్ది రోజులుగా ఆమె..సోనును దూరం పెడుతూ పెళ్లికి నిరాకరించింది. ఈ క్రమంలో గురువారం ఆమె ఇంటికి చేరుకొని తనను పెళ్లి చేసుకోవాలని అడిగాడు. అందుకు ఆమె నిర్దాక్షిణ్యంగా తిరస్కరించింది. దీంతో మనస్తాపానికి గురైన సోను ఆమె ఇంటికి ఎదురుగా ఉన్న ఓ భవంతిపైకి ఎక్కి అక్కడి నుంచి దూకుతానని బెదిరించాడు. ఇదంతా గమనించిన స్థానికులు వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేయడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. యువకుడికి కిందకు రప్పించేందుకు ప్రయత్నించారు. తన దగ్గరకు వస్తే భవంతిపై నుంచి దూకేస్తానని సోను బెదిరించాడు. తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో చేయి కోసుకున్నాడు. పోలీసులు అతడికి నచ్చజెప్పి సోనును అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళిబొట్టుకు మెరుగులు దిద్దుతానని..

వెంగళరావునగర్, మార్చి 6: తాళిబొట్టుకు మెరుగులు దిద్దుతానని నిమ్మించి.. తాళిబొట్టును తీసుకుని ఉడాయించాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ..ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్న వర్రె దయామణి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నది. ఫేస్‌బుక్‌లోని గోల్డ్ గ్రూప్ ద్వారా మహేశ్‌నారాయణదాస్ అనే పేరుతో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తాను నగల వ్యాపారినని నమ్మించి.. ఆమె ఫోన్ నంబర్ తీసుకుని హనుమాన్ జ్యువెల్లరీ అనే వాట్సాప్ గ్రూపులో యాడ్ చేశాడు. పుస్తెల తాడుకు మెరుగులు దిద్దాలని చెప్పగా.. నారాయణదాస్ ఆమె ఇంటికి వచ్చాడు. 40 గ్రాముల బంగారు పుస్తెలతాడును అతడి చేతికి ఇవ్వగా.. పరికరాలు తెచ్చుకోలేదని షాపునకు వెళ్లి చేయించి తీసుకొస్తానని నమ్మించాడు. ఇందుకు ఆధార్‌కార్డు జిరాక్స్, జ్యువెల్లరీ షాపు ఫొటోలతో పాటు..తన తండ్రి ఫోన్ నంబర్ అంటూ ఇచ్చాడు. దీంతో సరేనని అనగా పుస్తెలతాడును తీసుకెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు 15 రోజుల రిమాండ్

ఖైరతాబాద్, మార్చి 6 : మద్యం సేవించి వాహనం నడిపి ఓ వ్యక్తిని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మందుబాబులకు నాంపల్లి కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది. పంజాగుట్ట పోలీసుల వివరాల ప్రకారం... నిమ్స్ దవాఖానలోని క్యాంటిన్‌లో చెఫ్‌గా పనిచేస్తున్న లింగయ్య విధులు ముగించుకొని ఆస్పత్రి వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వైపునకు బైక్‌పై వస్తున్న బంజారాహిల్స్‌కు చెందిన లాలు ప్రసాద్ (25), సనత్‌నగర్‌కు చెందిన పవన్ కుమార్ (25)లు మద్యం మత్తులో లింగయ్యను ఢీకొట్టారు. పోలీసులు లాలు ప్రసాద్, పవన్ కుమార్‌ను అరెస్టుచేసి నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా, 15 రోజుల రిమాండ్ విధించారు.

పాన్‌షాప్ వ్యాపార